వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

రాయితీ విత్తనాల్లో కోత

- గతేడాది కంటే తగ్గిన కేటాయింపు
- వేరుశనగపై ధరాభారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇప్పటికే చిరు జల్లులు పలకరించాయి. కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. కర్షకులు దుక్కులు దున్నుతున్నారు. విత్తనాలు సమకూర్చుకొనే పనిలో పడ్డారు.. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన రాయితీ విత్తనాలను సిద్ధం చేసేందుకు వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్‌కు అప్పగించింది. ప్రభుత్వం రాయితీ విత్తనాలపై కోత విధించి రైతులపై భారం మోపింది. ఉమ్మడి జిల్లాకు 24,281 క్వింటాళ్లు కేటాయించారు. గతేడాది ఖరీఫ్ రాయితీ విత్తనాలతో పోలిస్తే కర్నూలు జిల్లాకు 2,981 క్వింటాళ్లు, నంద్యాలకు 207 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు తగ్గించారు...

కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు కాగా గతేడాది వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను వెంటాడాయి. సీజన్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాధారణ వర్షపాతం 401.1 మిల్లీమీటర్లు కాగా 329.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్‌లో 40 శాతం లోటు, జులైలో 64 శాతం అధిక వర్షం, అగస్టులో 75 శాతం లోటు, సెప్టెంబరులో పది శాతం లోటు వర్షపాతం నమోదైంది. జులై మినహా మిగిలిన మూడు నెలల్లో వర్షాలు నిరాజనకం. ఖరీఫ్ పంట దిగుబడులతో పోలిస్తే 60 నుంచి 80 శాతం పడిపోయాయి. వేరుశనగ ఎకరానికి సాధారణ దిగుబడి 8 క్వింటాళ్లు ఉండగా 1 నుంచి 2 క్వింటాళ్ల దిగుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది విత్తుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన రాయితీ విత్తనాలను సిద్ధం చేసేందుకు వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్‌కు అప్పగించింది. ప్రభుత్వం రాయితీ విత్తనాలపై కోత విధించి రైతులపై భారం మోపింది. ఉమ్మడి జిల్లాకు 24,281 క్వింటాళ్లు కేటాయించారు. గతేడాది ఖరీఫ్ రాయితీ విత్తనాలతో పోలిస్తే కర్నూలు జిల్లాకు 2,981 క్వింటాళ్లు, నంద్యాలకు 207 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు తగ్గించారు. 2023 ఖరీఫ్‌లో కర్నూలు 2518.199 క్వింటాళ్లు, నంద్యాలకు 8,207 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారు. ప్రస్తుతం ఖరీఫ్‌కు ఉమ్మడి జిల్లాకు 24,218 క్వింటాళ్ల రాయితీ విత్తనాలను కేటాయించారు. గతేడాది ఖరీఫ్ పోలిస్తే అన్ని రకాల విత్తనాలు కలిపి 3,125 క్వింటాళ్లు రాయితీ విత్తనాల్లో కోత విధించారు. వేరుశనగ విత్తనకాయలు కర్నూలుకు 1978 క్వింటాళ్లు, నంద్యాలలో 1,110 క్వింటాళ్లు కలిపి మొత్తం 8,088 క్వింటాళ్ల రాయితీ విత్తనాల్లో కోత విధించారు. గతేడాది కంటే 1,370 క్వింటాళ్ల కంది, 583 క్వింటాళ్ల మినుము విత్తనాలు అధికంగా కేటాయించారు. పెసలు గతేడాది 25 క్వింటాళ్లు కేటాయించగా ప్రస్తుతం 42 క్వింటాళ్లకు పెంచారు. కొర్రలు 45 క్వింటాళ్ల నుంచి 65 క్వింటాళ్లకు పెంచగా, జీలుగ 1700 క్వింటాళ్లను తగ్గించారు. పిల్లి పెసర 153 క్వింటాళ్లు కోత విధించారు.

2023 ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు 66,568 హెక్టార్లు కాగా గతేడాది 30,751 హెక్టార్లలో 46.19 శాతం మాత్రమే పంట సాగైంది. కంది 23,929 హెక్టార్లకుగాను 35,853 హెక్టార్లలో సాగు పెరిగింది. నంద్యాల జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 2.38 లక్షల హెక్టార్లు కాగా 2.18 లక్షల హెక్టార్లలో పండించారు. వేరుశనగ సాధారణ సాగు 15,801 హెక్టార్లు కాగా 6,500 హెక్టార్లతో కలిపి 12 శాతం సాగు చేశారు. కంది సాధారణ సాగు 37,551 హెక్టార్లు కాగా 32,130 హెక్టార్లతో 86 శాతం నమోదైంది. గతేడాది ప్రభుత్వం గుత్తేదారుల నుంచి వేరుశనగ క్వింటాలు రూ.9,300కు కొనుగోలు చేసి 40 శాతం (రూ.3,720) రాయితీ, రైతు చెల్లించాల్సిన నాన్ సబ్సిడీ ధర క్వింటాలుకు రూ.5,580 ధర ఉండేది. ప్రస్తుత ఖరీఫ్ సీజను ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయలను క్వింటాలు రూ.8,500కు కొనుగోలు చేసి 40 శాతం (రూ.3,800) రాయి తీ పోనూ, రైతులు నాన్ సబ్సీడీ కింద క్వింటాకు రూ.5,700 లు చెల్లించేలా ధరలను నిర్ణయించారు. క్వింటాకు రూ.120 చొప్పున ఉమ్మడి జిల్లాకు కేటాయించిన వేరుశనగ విత్తన కాయలపై రూ.19.65 లక్షలు అన్నదాతలపై విత్తన భారం పడనుంది. గతేడాది ఖరీఫ్ లో వేరుశనగ కే- రకం, కదిరి లేపాక్షి రకాల విత్తనాలు రైతులకు అందజేశారు. రాబోయే ఖరీఫ్‌కు కొత్తగా టిసిజిఎస్-1694 రకం విత్తనాలు పంపిణీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో కె-6 రకం 11,974 క్వింటాళ్లు, టిసిజిఎస్-1694 రకం 1250 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 705 క్వింటాళ్లు కేటాయించారు. నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి మండలాల్లోనే వేరశనగ ఎక్కువగా సాగువుతుంది. జిల్లాకు 2,450 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించగా అందులో కె-6 రకం 876 క్వింటాళ్లు, టిసిజిఎస్ రకం 525, కదిరి లేపాక్షి 1,049 క్వింటాళ్లు కేటాయించారు.

రైతుల పొలాలకు దారి చూపండి

- ఆర్‌డిఒకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రైతుల పొలాలకు దారి చూపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో వాగు నీటికి కొట్టుకుపోయిన దారికి మరమ్మతులు చేసి రైతుల పొలాలకు దారి చూపించాలని కోరుతూ కర్నూలు ఆర్‌డిఒకు రైతులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు మండలం ఉల్చాల గ్రామం నుండి సల్కాపురం వెళ్లేదారిలో దాదాపు 500 మంది రైతుల పొలాలు ఉన్నాయని తెలిపారు. దారి మధ్యలో వాగుకు వర్షాకాలంలో మాత్రమే నీళ్లు వచ్చేవి అయినప్పటికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా రైతులు భద్రంగా దారి ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. గత నెల నుండి కర్నూలు నగరానికి మంచినీళ్ల కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుండి ఉల్చాల గ్రామం మీదగా మంచినీళ్లు తీసుకువెళు న్నారని ఆ మంచినీటి ప్రవాహానికి రైతులు వేసుకున్న దారి కొట్టుకుపోయిందని తెలిపారు. రోడ్డు పాడైపోవడం వలన రైతులు పొలాలకు వెళ్లడానికి, సాగు చేసుకోవడానికి పొలాలు చదును చేసుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ సంవత్సరం నైరుతి పవనాలు వేగవంతంగా కదలడం చేత రైతులందరూ పంట పొలాలను విత్తనాలు వేసుకోవడానికి సిద్ధం చేసుకుంటున్నారన్నారు. ఈ సమయంలో ఉల్చాల గ్రామ రైతులకు రోడ్డు లేకపోవడం చేత పొలాలను విత్తనాలు వేయడానికి సిద్ధం చేయలేకపోతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టి రైతుల పంట పొలాలకు వెళ్లడానికి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దారి గుండా ఎద్దుల బండ్లు ట్రాక్టర్లు ఎలా తీసుకువెళ్లాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను అర్థం చేసుకొని వెంటనే మరమ్మతులు చేసి రైతుల పొలాలకు దారి చూపించాలని మనవి చేశారు. వినతి పత్రం స్వీకరించిన కర్నూలు ఆర్‌డిఒ సేశిరెడ్డి స్పందిస్తూ వెంటనే నివేదిక కలెక్టర్ పంపించి రైతులకు న్యాయం చేయడానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, గ్రామ రైతులు బడేసాహెబ్, వెంకటయ్య, లోకన్న, మద్దిలేటి, సత్యారెడ్డి, సుధాకర్, మధు, నాగన్న పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సుల జారీ

ప్రయివేటు సంస్థలకు ఇవ్వద్దు

సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి ప్రైవేట్ సంస్థల్లో డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసేలా నిబంధనలు తీసుకురావడం తక్షణమే నిలిపివేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. పిఎస్ .రాధాకృష్ణ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్‌టిఎ కార్యాలయాలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పే విధంగా నిర్ణయాలను అమలు చేస్తుందని, ఆర్‌టిఎ కార్యాలయాలని ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే ప్రక్రియ ఆర్‌టిఎ కార్యాలయంలో ఆర్‌టిఎ అధికారుల పర్యవేక్షణలో జరిపాలన్నారు. ఖచ్చితమైన డ్రైవింగ్‌తో లైసెన్స్ జారీ చేస్తున్నారని అలాంటి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న వాహన డ్రైవర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండా ప్రమాదాలకు కారణం కాకుండా జాగ్రత్త పడుతున్నారన్నారు. ప్రైవేట్ సంస్థలకు డ్రైవింగ్ లైసెన్సులు అప్ప చెప్పడం వల్ల డ్రైవింగ్ లైసెన్స్ ఫీజులు పెరగడమే కాక డ్రైవింగ్ రాని వారికి కూడా లైసెన్సులు ఇస్తే జరగబోయే ప్రమాదాలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం వల్ల వినియోగదారులపై అదనపు భారాలు పడతాయని వారన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆర్‌టిఎ కార్యాలయాల్లోని లైసెన్సులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే దశల వారి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా నాయకులు పి. మహిమూద్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్, ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు మున్నా, నగర అధ్యక్షులు హుస్సేన్ వలి, నబి ,శంషీర్‌బాష, కుమార్, మళ్లీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కలుగొట్లలో కార్డెన్ సర్చ్

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండల కేంద్రంలోని కలుగోట్ల గ్రామంలో బుధవారం సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ఇళ్లు, రాజకీయ నాయకులు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. జూన్ 4న వెలువలడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు జరిపామన్నారు. గ్రామ ప్రజలందరూ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్సులను

జిల్లా కేంద్రం స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చాలి

- ఎన్నికల కమిషన్‌కు టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సార్వత్రిక ఎన్నికలకు సంభందించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను నియోజకవర్గం కేంద్రంలోని స్ట్రాంగు రూములలో కాకుండా జిల్లా కేంద్రంలోని ఇవిఎంలు భద్రపరిచ్చిన సెంటర్లోని ప్రత్యేక స్ట్రాంగ్ రూములలో భద్రపర్చాలని కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తిచేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి నిర్వహించిన పత్రికా మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో జరిగిన ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఇప్పటి వరకు ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, పత్తికొండ నియోజకవర్గ కేంద్రాలలో సబ్ ట్రెజరీ కార్యాలయం స్ట్రాంగురూంలో భద్రపరిచారని, అక్కడ వాటికి సరైన భద్రతలేదన్న అనుమానాలను పోటీలో ఉన్న అభ్యర్థులు వ్యక్తపరిచారన్నారు. పోస్టల్‌బ్యాలెట్ బాక్సులను పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో పూర్తిస్థాయి పోలీసుల భద్రతతో, సంభందిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జిల్లా కేంద్రమైన కర్నూలు నగరంలోని స్ట్రాంగు రూములకు తరలించాలన్నారు. అన్ని సర్వేల అంచనాల ప్రకారం తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రాబోతున్నారని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని సాక్ష్యాత్తు కేంద్ర ఇంటిలిజెన్సీ అబిప్రాయపడిందని, ఓటమి భయంతో వైసిపి వారు ఎంతటికైనా తెగిస్తారని, ఎన్ని అప్రజాస్వామిక పద్ధతులకైనా వెనుకాడబోరని ఈ అంశాలన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల అధికారులు వెంటనే పోస్టల్ బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి చేర్చాలన్నారు.

మాట్లాడుతున్న తిక్కారెడ్డి

చెత్తను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ఇందిరాగాంధీనగర్‌లో చెత్తతొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇందిరాగాంధీ నగర్ చెత్తమయం అనే శీర్షికతో మంగళవారం ప్రజాశక్తి పేపర్లో రావడంతో నగరపాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించి ఇందిరా గాంధీ నగర్ కుళాయిల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదేశించారు. ప్రజాశక్తిలో ఇందిరాగాంధీనగర్ చెత్తమయం శీర్షికన వార్త వచ్చింది. అవార్డు కార్పొరేటర్ వచ్చే ఆ ప్రాంతపు వారిని గతంలో ఏం చేయించలేదా ఎందుకు పేపర్లో వేయించారని ప్రజలను నిలదీసినట్లు సమాచారం. రోజు చెత్తాచెదారం కంపు కొడుతూ వాసనను అనుభవించేది తాము కాబట్టి పత్రిక విలేకరి వచ్చి ఎన్ని రోజులు అయిందని అడగగా ఐదు నెలలు అయిందని, ఏమాత్రం అధికారులు స్పందించడం లేదు ఇటుగా రావడం లేదని చెప్పామని సమాధానం ఇచ్చారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు ఉపక్రమించినందుకు ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాక ఇక్కడ చెత్త వేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరికలు చేస్తూ మున్సిపల్ అధికారులు బోర్డు పెట్టాలని, సిసి కెమెరాలు అమర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

ఇద్దరు మహిళల హత్య నిందితుడు అరెస్టు

24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

48 గంటల్లో రిమాండ్‌కు నిందితుడు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇద్దరు మహిళల హత్యకు కారకుడైన ఆటోడ్రైవర్ షేక్ మహబూబ్ బాషను పోలీసులు 24గంటలలోపు పట్టుకున్నారు. విచారణ పూర్తయిన అనంతరం 48 గంటలలో రిమాండ్‌కు పంపారు. తాలూకా సిఐ ఎం.శ్రీధర్ వివరాల ప్రకారం....కర్నూలు రేంజ్ డిఐజి విజయరావు, కర్నూలు జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కర్నూలు అడిషనల్ ఎస్‌పి నాగరాజు, కర్నూలు డిఎస్‌పి విజయశేఖర్, సిబ్బందిని 3 బృందాలుగా కర్నూలు 2 టౌన్ సిఐ ఇంతియాజ్ బాష, వారి సిబ్బంది,కర్నూలు నాలుగో పట్టణ సిఐ శంకరయ్య, వారి సిబ్బంది, కర్నూలు తాలూకా సిఐ ఎం.శ్రీధర్ సిబ్బంది ఆధ్వర్యంలో అహర్నిశలు కృషి చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించి ఇద్దరు మహిళల హత్యకు కారణమైన ముద్దాయి ఆటో డ్రైవరు ఎస్.మహబూబ్ బాషను 24 గంటల లోపు పట్టుకొని, 48 గంటల లోపు రిమాజండ్‌కు తరలించారు. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామ పొలిమేరలో ఉన్న నగరవనం సమీపంలోని చెరువులో ఇద్దరి ఊరు, పేరు, చిరునామా తెలియని మహిళల మృత దేహాలు నీటిలో తేలియాడుతుండగా గ్రామ తలారి ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న విఆర్ఓ సదరు నేర స్థలాన్ని చేరుకొని శవాల ఆచూకీ కోసం చుట్టుప్రక్కల గ్రామాలలో విచారించి ఎలాంటి సమాచారం తెలియనందున విచారించి తగిన చర్యకు కర్నూలు తాలూకా సిఐకి ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరు మహిళలు అరుణ, జానకిలది తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాగా గురించారు. వారు వేశ్య వత్తి నిమిత్తం కర్నూలుకు కొన్ని సంవతారాల కిందట వలస వచ్చి కర్నూలును కేంద్రంగా చేసుకొని వారి వత్తి కొనసాగించేవారు. ఈ క్రమంలో వారికి కర్నూలు నగరానికి చెందిన ముద్దాయి ఆటో డ్రైవరు పరిచయమయ్యాడు. గతంలో ఆటో డ్రైవరుకు జానకికి వచ్చిన మనస్పర్ధల వల్ల జానకీ ఆటో డ్రైవరును వేరే వ్యక్తుల చేత కొట్టించింది. అది మనసులో పెట్టుకొని మహబూబ్ బాష జానకి పై కక్ష పెంచుకొని ఎలాగైనా జానకి మీద ప్రతీకారం తీచ్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ క్రమంలో ఈనెల18న జానకి, అరుణ బట్టలు ఉతుక్కోవడానికి నగరవనం చెరువు వద్దకు ముద్దాయి ఆటోలో వెళ్లారు. బట్టలను ఉతుక్కుంటుండగా అవకాశం కోసం ఎదురు చూస్తున్న ముద్దాయి జానకిని వెనక నుండి చెరువులోనికి తోసేశాడు. ఈ క్రమం లో ముద్దాయి కూడా నీటిలో పడిపోగా పక్కన ఉన్న అరుణ ముద్దాయిని రక్షించబోయి ఆమె కూడ నీటిలో పడిపోయింది. ముద్దాయి గట్టుకు దగ్గరలో ఉన్నందున నీటినుండి బయటకు వచ్చాడని, అప్పటినుండి పోలీసులకు కనపడకుండా తిరుగుతుండగా పోలీసులు అతనిని కనిపెట్టి పట్టుకుని అరెస్ట్ చేసి రిమండ్ కు పంపారు.

నిందితుడు ఎస్.మహబూబ్‌బాష

అభ్యర్థుల అధికార ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలులో బుధవారం 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోటీ చేసిన అభ్యర్థులు,వారి అధికారిక ప్రతినిధులతో రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ్ తేజ , కౌంటింగ్ నిర్వహణ అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ నెల30లోపు ఫారం 18ని ఉపయోగించి అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి ద్వారా తమ కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా 14 టేబుళ్లు ఇవిఎం ఓట్ల లెక్కింపునకు, 4 టేబుళ్లు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేశామని, ప్రతి అభ్యర్థి, ప్రతిటేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియ మించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న ఏజెంట్లకు ఫోటో గల గుర్తింపు కార్డు ఇస్తామన్నారు. కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్లు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, కౌంటింగ్ ఏజెంట్ వెరిఫికేషన్ సెంటర్ వద్ద తమ మొబైల్ ఫోన్లను జమ చేయవలసి ఉంటుందన్నారు.సమావేశంలో అసిస్టెంట్ ట్రైనింగ్ కలెక్టర్ చల్లా కళ్యాణి , కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎఆర్ఒ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

పోలకల్‌లో తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని పోలకల్‌లో బుధవారం తెలంగాణ మద్యం అమ్ముతుండగా ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బంది పట్టివేశారు. సుమారు 182 ఒరిజనల్ ఛాయస్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని వ్యాపారి బైతెత్తి రంగన్నను అదుపులోకి తీసుకోని మీడియా ఎదుట హాజరు పరిచారు.ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, తరలించినా ఎంతటివారికైనా చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ఆయిల్ అండ్ రైస్ మిల్స్ కార్మిక కార్యదర్శివర్గం సమావేశం బుధవారం కార్మిక కర్షక భవన్‌లో యూనియన్ నాయకులు ఎర్రమల్ల అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ , సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు మాట్లాడారు. సిఐటియు 1970 మే 30న ఏర్పడిందన్నారు. గడచిన 54 సంవత్సరాల కాలంలో కార్మికుల శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, కార్మికుల హక్కులకోసం నిరంతరం రాజీలేని పోరాటంచేస్తుందన్నారు. పెట్టుబడుదారులు, పాలకవర్గాలు ఇద్దరూ ఒక్కటై కార్మికుల శ్రమను దోచుకోవాలని, కనీస వేతనాలు ఇవ్వకుండా, పని గంటలు పెంచి కార్మికులను ఇబ్బంది పెట్టాలని చూసిన ప్రతిసారి దీనిని సిఐటియు ఎప్పటికప్పుడు ఐక్యపోరాటాలద్వారా తిప్పికొడుతూ కార్మికుల హక్కులను కాపాడడంలో సిఐటియు ముందుపీఠిన ఉన్నదన్నారు. పెట్టుబడుదారులవిధానాలకు వ్యతిరేకంగా నికరంగా నిలబడుతూ భారతదేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా సిఐటియు అభివృద్ధి చెందిందన్నారు. ఈనెల 30న కార్మిక వాడల్లో సిఐటియు జెండాలు ఆవిష్కరణ చేసుకుని, కార్మిక, కర్షక భవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సభను కార్మిక వర్గం జయప్రదంచేయాలన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి తన జీవితాన్ని కార్మిక వర్గ సేవకే అంకితం చేసిన కార్మిక పోరాట యోధుడు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జూన్ 8న కార్మిక కర్షక భవన్‌లో ఉదయం 10 గంటలకు సభ జరగనుందని, ఈ సభకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ అండ్ రైస్ మిల్ యూనియన్ నాయకులు రామిరెడ్డి, మద్దిలేటి, శేఖర్, సామన్న, వెంకటేశ్వర్లు, హనుమంతు, రంగస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

పత్తికొండ కూరగాయల దుకాణం

కొండెక్కిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-పత్తికొండ

నిత్యవసర సరుకులతో పాటు కూరగాయల ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్య ప్రజలు కూరగాయలు తినడానికి ఇబ్బందులు పడుతున్నారు. దుకాణానికి వెళితే అబ్బో ఏమి ధరలు అనే విధంగా ఉన్నాయి. పచ్చిమిరప కిలో ధర రూ.100, క్యాబేజీ రూ.60, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, బీరకాయలు రూ.60, బెండకాయ రూ.60,టమోటా 30, ఉర్లగడ్డలు 3 కేజీలు రూ.100, చోలే కాయలు రూ.60 ధరలు ఉన్నాయి.

సాగుకు విత్తనాలు సిద్ధం:ఏఒ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ఖరీఫ్ సందర్భంగా వ్యవసాయ కేంద్రాలలో కందులు, జీలుగ, వేరుశెనగ, వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బంది హాజరును, పని తీరును పరిశీలించారు. ఇక్కడే ఖరీఫ్ సందర్భంగా రైతులు పంటల సాగులో నిమగ్నం అయ్యారని సిబ్బంది అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆందోళన చేపడుతున్న కూలీలు

ఉపాధి కూలీల ఆందోళన

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలు ఆందోళనకు దిగారు. ఉపాధి హామీ చట్టం కూలీల కష్టాలు వర్ణనాతీతం. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మండుటెండలను సైతం లెక్క చేయకుండా పనికి వెళ్తున్న కూలీలకు పనులు హాజరు విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేటీలు అవకతవకలకు పాల్పడుతున్నారని గజ్జహళ్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 500 మంది కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ రంజాన్ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడారు. 6 రోజులు పని చేస్తే 3 రోజుల కూలి పడుతోందని, అది కూడా తక్కువ మొత్తంలో రోజుకు రూ.250 చొప్పున బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ చేయాల్సిన పనులు ఓ మేటీ అన్ని గ్రూపులకు సంబంధించిన హాజరు వేయడం, ఉపాధి పనులకు రాని వారికి మాత్రం రూ.300 చొప్పున కూలీ డబ్బులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి రాని వారికి ఎంతో కొంత డబ్బులు ఇచ్చి మిగతా మొత్తాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం క్షేత్ర సహాయకుడిగా పని చేస్తున్న వ్యక్తి గతంలోనూ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యాడని తెలిపారు. మళ్లీ అతడికే అధికారులు అవకాశం కల్పించడంతో పెట్రేగిపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పని చేస్తున్న తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్, మేటీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎపిఒ భక్తవత్సలంను వివరణ కోరగా... ఫీల్డ్ అసిస్టెంట్, మేటీలపై ఆరోపణలు వచ్చాయని, వాటిపై విచారణ చేసి, ఉపాధి పనుల హాజరు విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా హనుమంతు వర్ధంతి

ప్రజాశక్తి - ఆదోని

నివాళులర్పిస్తున్న నాయకులు

ఉపాధ్యాయ ఉద్యమ నేత హనుమంతు 3వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆదోనిలోని సిఐటియు కార్యాలయంలో హనుమంతు చిత్రపటానికి సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి గోపాల్, లక్ష్మన్న, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాసులు, డివైఎఫ్ఐ అధ్యక్షులు వీరేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో ఉంటూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించేవారని తెలిపారు. ఉపాధ్యాయులుగా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆందోళనలతో చైతన్యం నింపే గొప్ప నాయకుడని కొనియాడారు. విద్యార్థి, యువజన, కార్మిక వర్గ పోరాటాలకు చేదోడు వాదోడుగా ఉంటూ సమస్యలపై స్పందించే మంచి మనిషి అని తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా : సిఐ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఉన్నతాధికారుల ఆదేశాలతో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తాలూకా సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అలసందగుత్తి గ్రామంలో సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామానికి నలువైపులా తనిఖీలు చేపట్టి గ్రామంలో ఉన్న వారు బయటకు వెళ్లకుండా, బయటి వారు గ్రామంలోకి రానివ్వకుండా కార్డెన్‌సెర్చ్ నిర్వహించామని తెలిపారు. గ్రామంలో కర్ణాటక మద్యం అమ్మే వారి, ఇల్లును, రౌడీ షీటర్స్ సస్పెక్ట్‌లను తనిఖీ చేసి, హెచ్చరించారు. గ్రామ వీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించారు. ముఖ్యమైన కూడలిలో మీటింగులు ఏర్పాటు చేశారు. సాధారణ ఎన్నికల నుంచి ఫలితాలు వచ్చిన తర్వాత కూడా గ్రామంలో ఎవరూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని తెలిపారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల వచ్చే వరకు పెట్రోల్, డీజిల్ అమ్మకూడదని గ్రామంలో రిటైల్ పెట్రోల్, డీజిల్ షాపు యజమానులకు సూచించారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో మారణాయుధాలు, కర్రలు, రాడ్లు, కంకరరాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి సోదాలు చేశారు. ఎర్రిస్వామి, శ్రీనివాసులు, చిన్న పీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!

- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రోడ్డుపైనే వర్షపు నీరు

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షం వచ్చినా నీరు ఎక్కడపడితే అక్కడ నిలుస్తున్న పరిస్థితి ఉంది. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువలపై బండలు వేయడం వల్ల ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోయి నీరు ముందుకు పారని పరిస్థితి ఉంది. టీ, టిఫిన్ చేసిన తర్వాత వ్యర్థాలను కాలువలో వేస్తున్నారు. సక్రమంగా బయటకు తీయకపోవడంతో పేరుకుపోయి కొన్ని చోట్ల దుర్వాసన వస్తోంది. చిన్నపాటి వర్షం వచ్చిన నీరు కాలువలోకి పోనీ పరిస్థితి ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా

వర్షం కురిసినప్పుడు ఆ నీరు కాలువల్లోకి పారాల్సి ఉంది. పట్టణ వీధుల్లో రోడ్డుకు ఎత్తుగా కాలువలు నిర్మించడం వల్ల ఆ నీరంతా రోడ్డుపైనే పారుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా శ్రీనివాస భవన్, అంబేద్కర్ విగ్రహం వద్ద మురుగునీరు నిలుస్తోంది. ఆ సమయంలో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. డ్రెయినేజీ ఆధునీకరణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా పరిస్థితి మాత్రం మారకపోవడంతో ప్రజలు విసిగెత్తిపోతున్నారు. కాలువలపై నిర్మాణాలు తొలగిస్తున్నామని చెబుతున్నా యథావిధిగానే నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

కాలువలపై డ్రిల్ అంతంత మాత్రమే

కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించేందుకు అనుకూలంగా ఉండేందుకు దుకాణాల ముందు ఇనుప డ్రిల్ వేయించుకోవాలని గతంలో అధికారులు సూచన చేశారు. కొందరు డ్రిల్ వేయించుకోక బండలు పరచుకోవడం వల్ల చెత్తాచెదారం నిండి దుర్వాసన వస్తోంది. వర్షపు నీరు అందులోకి ప్రవేశించకుండా వ్యర్థాలు అడ్డుకోవడంతో కాలువలు పొంగిపొర్లి రోడ్డుపైకి నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు వీధులు శుభ్రం ఉండేలా, నీరు నిలవకుండా చూడాలని కోరుతున్నారు.

బస్టాండ్ ఆవరణమంతా అపరిశుభ్రత

చిన్నపాటి వర్షం వచ్చినా ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణమంతా అపరిశుభ్రంగా మారుతోంది. బస్సులు బయటకు వెళ్లే ప్రాంతంలో మురుగునీరు నిలవడం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడి నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఒంగోలు, వేలూరు, విజయవాడ, శ్రీశైలం, బళ్లారి, రాయదుర్గం వంటి సుదూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. బస్టాండ్ ఆవరణలో పరిశుభ్రత లోపించడంతో ప్రయాణికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆదాయం సమకూరుస్తున్న ఆర్‌టిసి బస్టాండ్‌ను నిర్లక్ష్యం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శుభ్రత పనులు చేపట్టి ఆహ్లాదకర వాతావరణం ముట్టిపడేలా చూడాలని కోరుతున్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

డివిజన్‌లో 44.0 మిమీ వర్షపాతం నమోదు

ఆదోని డివిజన్ మొత్తం 44.0, సగటు 4.9 మిల్లీమీటర్ల వర్షపాతం బుధవారం నమోదైంది. ఆదోని 20.4, ఎమ్మిగనూరు 8.6, నందవరం 1.4, కౌతాళం 8.6, పెద్దకడబూరు 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ఇళ్లలో నీరు చేరి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆర్‌టిసి బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచాలి

- డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్

డివిజన్ కేంద్రమైన ఆదోని ఆర్‌టిసి కొత్తబస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. చిన్నపాటి వర్షం వచ్చినా ఆవరణమంతా చిత్తడిగా మారడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంతో ఆదాయం సమకూర్చే ఆర్‌టిసి బస్టాండ్‌ను అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదు. రాత్రి వేళల్లో ఆవరణలో కూడా లైట్లు వెలిగేలా చూడాలి. మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేసి మురుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. లేకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తాం.

ఘనంగా సప్తా కార్యక్రమాలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో సప్తా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిస్తీ ఆధ్వర్యంలో స్వామివారికి ఇష్టమైన నైవేధ్యాన్ని ఏర్పాటు చేసి ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం ఆ నైవేధ్యాన్ని కిస్తీలో ఉంచడంతో ఆ ప్రసాదాన్ని అందుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. వందల సంఖ్యలో భక్తులు, స్వామివారి శిష్య బృందం పాల్గొన్నారు.

కౌతాళంలో జాతర : శ్రీజగద్గురు జగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు ఒక జాతరను తలపించాయి. గాజుల అంగళ్లు, మిఠాయి, బొమ్మల తదితర అంగళ్లు వ్యాపించడంతో గ్రామస్తులు తమ బంధువులతో కిటకిటలాడాయి. చిన్న, చిన్న వ్యాపారుల కుటుంబాలు ఇలాంటి జాతరపై ఆధారపడి ఉంటాయి.

వైభవంగా సుంకులమ్మ దేవి గ్రామదేవర

- మహోత్సవంలో అశేష జన సమూహం

ప్రజాశక్తి - చిప్పగిరి

మేటి కుంభంతో వెళ్తున్న మహిళలు

మండలంలోని నేమకల్లు పంచాయతీ మజరా గ్రామమైన సంగాలలో వెలసిన సంతాన వర ప్రధాయిని సుంకులమ్మ దేవి గ్రామ దేవర వైభవంగా సాగింది. దేవర మహోత్సవం మంగళవారం రాత్రి మేటి కుంభం, కుంభం ఆలయ కమిటీ పెద్దలు, గ్రామ పెద్దలు, ప్రజలు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధవారం వేకువజాము నుంచి ఇంళ్లలో నుంచి అమ్మవారికి ఎడ (మొక్కుబడి ఉన్న ఏదైనా కావచ్చు) తీసుకెళ్లే కుంభాలన్నీ అమ్మవారి ఆలయానికి వచ్చి మొక్కుబడి చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవర మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. దేవర మహోత్సవానికి వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి, వైసిపి మండల నాయకులు, టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్, టిడిపి మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి విందులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ వెంకటేశులు, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న విరుపాక్షి

కరువు సహాయక చర్యలు చేపట్టండి

- విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలి
- 200 రోజులు ఉపాధి పని కల్పించాలి
- తహాశీల్దార్‌కు వ్యకాస వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు నెలకొని మండల రైతులు తీవ్రంగా నష్టపోయారని, మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి కరువు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది కరువు రైతులను తీవ్రంగా నష్టపరిచిందని తెలిపారు. ఎకరాకు రూ.వేలకు వేల పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర నష్టం చవిచూశారని చెప్పారు. ప్రభుత్వం మాత్రం అరకొర సహాయంతో రైతులకు న్యాయం చేయలేదని తెలిపారు. ఎకరాకు రూ.20 వేల పరిహారంతో రైతులకు కాస్తయినా న్యాయం జరిగేదని పేర్కొన్నారు. కరువు ప్రకటించిన ప్రాంతాల్లో కరువు సహాయక చర్యల్లో భాగంగా ఈ ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం సరఫరా చేయాలని, తద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు, మందుల బెడద నుంచి రైతులను కాపాడుకునేందుకు అధికారులు నిత్యం విత్తనాలు, ఎరువులు దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తిగా వ్యవసాయ పనుల మీద ఆధారపడుతున్న కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. అనంతరం తహాశీల్దార్ మాట్లాడారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కారానికి తగిన కృషి చేస్తామని తెలిపారు. రామాంజనేయులు, రాముడు, నాగన్న, వీరాంజి పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న వ్యకాస నాయకులు

సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

గొడవలకు పాల్పడితే చర్యలు

- కున్నూరులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని కున్నూరు గ్రామంలో ఎమ్మిగనూరు ఎస్‌డిపిఒ సహకారంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ... గ్రామంలో అనుమానితుల ఇళ్లను సోదా చేశామని తెలిపారు. అల్లర్లు జరగకుండా ముందస్తుగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు ముగిసిన తర్వాత గ్రామంలో గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మిగనూరు, గోనెగండ్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరివేములను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కరివేముల గ్రామాన్ని బుధవారం రాష్ట్ర కీటక జనతా వ్యాధుల నియంత్రణ అధికారులు కొండారెడ్డి, రామచంద్ర సందర్శించారు. గ్రామంలో లార్వా డెన్సిటీ ఎక్కడైనా ఉందేమోనని గ్రామంలో చాలాచోట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి వారు కొన్ని సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడేను కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు. లార్వా ఉంటే వాటిని వెంటనే తొలగించాలని తెలిపారు. అలాగే జ్వరం కేసులు ఉంటే రక్త పూత నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాలని కోరారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో నాలుగు వారాలు కచ్చితంగా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు పొందండి

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాస రావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్య శాలలో ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు పొందాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, వైద్యశాల కో ఆర్డినేటర్ విజయీంద్ర రావు కోరారు. బుధవారం స్థానిక శ్రీమఠం పరిపాలన కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాలతో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన టీం నుంచి మైసూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఆంజనేయ మూర్తి ఈనెల 26న ఉదయం 10 గంటల నుంచి ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్సలు అందిస్తారని చెప్పారు. పైల్స్, ఫిస్టులా అండ్ ఫిషర్స్, వాటిని పరీక్షలు అందిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, కన్సల్టెంట్ రాజేశ్వర్ తెలిపారు. బుధవారం దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ రైతు మల్లికార్జున పొలంలో డాట్ ప్రూఫ్ మోడల్స్ వేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రసాయనాలు వాడి పండించిన ఆహారం తింటే ఆరోగ్యం క్షీణిస్తుందని చెప్పారు. నేల నిర్వహణలో దీర్ఘకాలం మనగలిగే నిర్వహణ పద్ధతులను ప్రచారం చేస్తూ భూమిని, ఆహారం, నీటి అవసరాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రసాయనిక వ్యవసాయ పద్ధతులు వదిలేసి ప్రకృతికి దగ్గరవ్వాలని సూచించారు. నేల, నీరు, గాలి వంటి సహజ వనరులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని, వ్యవసాయంలో రసాయనాలతో నిండిపోయి నీటి వనరులు దెబ్బతింటున్నాయని తెలిపారు. నేల ఉత్పాదకత శక్తి తగ్గిపోతుందన్నారు. పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. నీటి వనరులు, అడవులు, జీవవైవిధ్యం, తీరప్రాంత పర్యావరణం బాగా నష్టపోతుందని చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలంటే భవిష్యత్తు తరాల మనుగడ ప్రమాదాల్లో పడిందని తెలిపారు. భవిష్యత్తు తరాలను కాపాడుకోవడం కోసం విషరహిత సమాజస్థాపన అందరి బాధ్యత అని వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికీ అవగాహన కల్పించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎక్కువ రకాల పంటలు వేసుకొని ఆదాయంతో పాటు నేలలో జీవపదార్థం, భూసారం పెరుగుతుందని చెప్పారు. మొక్కలు పెరగడానికి అవసరమైన పోషకాలన్నీ నేలలో ఉంటాయని తెలిపారు. విత్తన గుళికల తయారీ విధానం, వాటి లాభాల గురించి వివరించారు. మహిళలందరూ ఇంటి ముందు ఉన్న స్థలాల్లో కిచెన్ గార్డెన్స్, లేదా సూర్య మండలం వంటి వాటిలో ఆకుకూరలు, కూరగాయలు వేసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్లు మల్లికార్జున, భుజేశ్వరుడు, ఎంటి.సుధాకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పరి : ఒకే రకమైన పంట కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నవధాన్యాలతో పలు రకాల పంటలు వేయడం వల్ల రైతుకు ఆదాయంతో పాటు నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని నగరూరు గ్రామంలో 24 రకాల విత్తనాలకు బీజామృతంతో వేసినట్లు తెలిపారు. ఈ రకంగా వేసుకోవడం వల్ల పంటలు వైవిధ్యం ఏర్పడుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పద్ధతిలో ఎక్కువ రకాల పంటలు వేసుకొని ఆదాయంతో పాటు నేలలో జీవపదార్థం, భూసారం పెరుగుతుందని తెలిపారు. మొక్కలు పెరగడానికి అవసరమైన పోషకాలని నేలలో ఉంటాయని, రైతులకు అర్థమయ్యే విధంగా సిబ్బంది తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన ఆహారం తినడం వల్ల ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పంటలకు వచ్చే పురుగు, తెగుళ్లపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ మల్లికార్జున, నగేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీరేష్, నాగార్జున, నాగభూషణం, రంగముని, నరసింహులు, భూలక్ష్మి, జగదాముడు, లక్ష్మీకాంత్, పులిశేఖర్ పాల్గొన్నారు.

దేవనకొండలో వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న అధికారులు

ఆస్పరిలో వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న అధికారులు

పండ్లతో కీలక పోషకాలు

- కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ అశోక్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పండ్లలో మానవ శరీరానికి అవసరమైన అనేక కీలక పోషకాలు లభిస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. అభివృద్ధి దశలో పండ్లు సరైన ఆకారం, బరువు, పరిమాణం, రంగు, వాసన, రుచి సంతరించుకుంటాయని తెలిపారు. పూర్తిగా మాగిన పండ్లు మృదువుగా, తీయగా, తక్కువ ఆకుపచ్చ రంగు కలిగి ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం మామిడి కోతకు వస్తోందని తెలిపారు. మామిడి కాయలు త్వరగా పక్వం చెందేందుకు కృత్రిమంగా కాల్షియమ్ కార్బైడ్‌తో మాగబెట్టడం ఆరోగ్యహానికరమని చెప్పారు. తాజా ఉత్పతులు రసాయన కాలుష్యానికి గురవుతున్నాయని తెలిపారు. కాల్షియమ్ కార్బైడ్ ద్వారా మాగబెట్టిన పండ్లు ఆకర్షణీయమైన రంగు కలిగి ఉన్నప్పటికీ తక్కువ రుచి, వాసన కలిగి త్వరగా పాడవుతాయని చెప్పారు. దీనికి బదులు వరిగడ్డిలో మాగబెట్టడం, కాల్షియమ్ కార్బైడ్‌కు బదులు మామిడి పండ్లను 100 పిపిఎం ఇథలిన్ వాయువు కలిగిన వాతావరణంలో 24 గంటలు బహిర్గతం చేసి తర్వాత గది ఉష్ణోగ్రత వద్ద 5 రోజుల్లో మాగబెట్టవచ్చని తెలిపారు. అరటి పండ్లను 100 పిపిఎం ఇథిలీన్ వాయువు కలిగిన వాతావరణంలో 18 గంటలు బహిర్గతం చేసి గది ఉష్ణోగ్రత వద్ద 4 రోజుల్లో మాగబెట్టవచ్చని చెప్పారు. ఈ పద్ధతిలో మొదటగా 1 ఘ.మీ. ఘనపరిమాణం గల చట్రాన్ని చెక్కతో కానీ, ప్లాస్టిక్ పైపుతో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తర్వాత చట్రం చుట్టూ గాలి దూరని విధంగా పాలిథిన్ షీట్ లేదా టార్పాలిన్ షీట్ చుట్టాలని సూచించారు. తర్వాత చట్రంలో మూడోవంతు వరకు పక్వానికి వచ్చిన పండ్లను ప్లాస్టిక్ క్రేటర్లో నింపి ఉంచాలని తెలిపారు. తర్వాత ఒక చిన్న పాత్రలో 2 మి.లీ. 30 శాతం శుద్ధత కలిగిన ఎథ్రిల్ ద్రావణాన్ని తీసుకొని దానికి 0.5 గ్రాముల సోడియం హైడ్రాక్సైడ్ గుళికలు కలిపి క్రేట్ల పక్కన ఉంచి గాలి చొరబడని విధంగా పాలిథీన్ లేదా టార్పాలిన్ మూతని గట్టిగ కట్టాలని చెప్పారు. ఈ మిశ్రమం నుంచి విడుదలయ్యే ఇథలిన్ వాయువు పండ్లు మాగడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ మిశ్రమం చేతులకు కానీ, పండ్లకు కానీ తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇథలిన్ వినియోగం కృత్రిమ పద్ధతిలో పండ్లు మాగబెట్టడానికి కాల్షియం కార్బైడ్‌కు ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా సూచించవచ్చని, పండ్ల వ్యాపారులు వీటిని పాటించవచ్చని తెలిపారు.

ఈవిఎంలు పగులగొట్టిన వైసిపి అభ్యర్థిపై

శాశ్వతంగా అనర్హత వేటు వేయాలి

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఈవిఎంలు పగులగొట్టిన వైసిపి అభ్యర్థిపై ఎన్నికల కమిషన్ కొరడా జలిపించి శాశ్వతంగా అనర్హత వేటు వేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయా లేదా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు రాచమార్గంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లే అధికారాన్ని రాజ్యాంగాన్ని అనుసరించి ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. లోపలకెళ్లి ఓటింగ్ సరళీ, తదితర విషయాలు పరిశీలించాలే కానీ ఈవిఎంలు పగులగొట్టడానికి కాదని పేర్కొన్నారు. అభ్యర్థి వ్యవహార శైలి రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే ఆయన భవిష్యత్తులో ఎన్నికల్లో పాల్గొనకుండా బహిష్కరించేలా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవిఎంలు పగులగొడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధి, మాజీ విప్ పిన్నెల్లి ఇలాంటి ఘటనలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా శాశ్వతంగా ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల రోజు అభ్యర్థులు ఎక్కడైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే వారందరిపై శాఖపరమైన చర్యలతో పాటు శాశ్వత అనర్హత వేటు వేయాలన్నారు. రాష్ట్ర నాయకులు వి.ఎం.గోపాల్ ఉన్నారు.

మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

అక్రమ గుడిసెలను తొలగించాలి

- కమిషనర్‌కు బీసీ సంఘాల వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు హిందూ రుద్ర శ్మశాన వాటిక స్థలంలో ఆక్రమణదారులు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హిందూ రుద్ర శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జిఒ కార్యాలయ ఆవరణలో శ్మశాన వాటికకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను, డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు గణేష్, బిఎల్.నారాయణ, బజారి, రంగన్న, రామస్వామి మాట్లాడారు. హిందూ రుద్ర శ్మశాన వాటిక భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. శ్మశాన భూమి హద్దులను గుర్తించేందుకు మున్సిపల్, రెవెన్యూ సర్వే సిబ్బంది చేత రెండు దఫాలుగా సర్వే చేయించి రెండు నెలలు కావస్తోందని తెలిపారు. ఇంతవరకు శ్మశాన వాటిక భూమికి సంబంధించిన సర్వే స్కెచ్‌లను అధికారులు అందజేయలేదన్నారు. సర్వే స్కెచ్‌లను అందజేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులు శ్మశాన వాటిక స్థలంలో వేసుకున్న గుడిసెలకు దొడ్డిదారిలో ప్రభుత్వ అనుమతులు పొందడానికి ప్రయత్నిస్తున్నారని, మున్సిపల్ కమిషనర్ శ్మశాన వాటికకు సంబంధించిన భూమిలో అక్రమ నిర్మాణాలకు తోడ్పడే అనుమతులు ఇవ్వకూడదని కోరారు. నాయకులు రామచంద్ర, వెంకటేష్, యాపిలయ్య, రవి, కృష్ణ, గిడ్డయ్య పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న బీసీ సంఘాల నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య డిమాండ్ చేశారు. బీసీల దాడిలో గాయపడిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన బాధితులు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వారిని పరామర్శించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన రాముడు, శేఖర్, ఇమ్మానుయేలు, మల్లేష్‌పై అదే గ్రామానికి చెందిన బీసీలు బోయ శంకర్, బోయ వీరేష్, బోయ అశోక్, మంగలి చంద్రశేఖర్, మెట్ట వీర నాయుడు దాడి చేశారని తెలిపారు. విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచి, కులం పేరుతో దూషించి అవమాన పరిచారని చెప్పారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.